

# 17

## కుప్పిలి పద్మ

ఆకుపచ్చ మైదానాలపై యేటవాలుగా కురుస్తోన్న నీరెండని తరగతి గదిలోంచి చూస్తోంది మృదుల. వో పక్క నుంచి లీలగా వినిపిస్తోన్న పిల్లలు ఆటల కేరింతలు. లంచ్ సమయంలో చప్పున తినేసి పరుగు పరుగుగా మైదానంలోకి వెళ్లిపోయి బాస్కెట్‌బాల్, త్రోబాల్, ఫుట్‌బాల్, కోకో ఆడుతోన్న పిల్లలు చూస్తుండగానే కనుచూపు మేరంతా ఆవరించిన కొండలపై నుంచి పల్చని మేఘాలు సావకాశంగా కదుల్తూనో జల్లుని కురిపిస్తుంటే వీటి ఆగమనం గమనించని సూర్యరశ్మి వెళ్లే టైమ్ లేక అలానే జల్లుకి తడుస్తూ 'చిరుజల్లులో తడవటం యెంత బాగుందో' అనుకొంటూ సూర్యరశ్మి వానకి వొళ్లు అప్పజెప్పేసి.... తుళ్లింతగా ఓ ఇంద్రధనస్సుని కాన్కగా యిచ్చేసింది. ఆ హరివిల్లుని చూస్తూ బయటకి వచ్చి ఆరుబయట వరండాలో నిలబడి చూస్తున్న ఆమెకి కాస్త చేరువగా పిల్లల సందడి.



# నమ్మదగిన నెలవంక

యెండైనా వానైనా వాళ్లకి ఒక్కటే ఆడుతానె వుంటారు అనుకుంటూ మైదానబాట మధ్యనున్న కాలిబాట వెంట కొండలవేపు చిన్నగా నడుస్తోంది మృదుల. గాలికి ప్లెయిన్ ఆరెంజ్ కలర్ శారీ పైట గాలికి యెగురుతోంది. కొండకి అటువైపు నుంచి కిందికి దిగుతోన్న జయదీప్, కళ్లప్పగించి చూస్తుండి పోయాడు. అతని పక్కనుంచే ఆమె మెల్లగా నడుచుకొంటూ వెళుతుంటే ఆమె కురుల్లోంచి ఫ్రెష్ గార్డెన్ ఐరిస్ సువాసనలు.... యీ మారుమూల యీ కొండల నడుమ పచ్చని మైదానాలలోంచి నడిచొచ్చే ఈ అవని హరివిల్లు 'యెవరా' మనసులోనె అనుకొన్నాడు జయదీప్. కిందకి దిగుతోన్న అతను ఓ క్షణం ఆగి, 'నేనిలా కిందకి, ఆమె అలా పైకి వెళ్లిపోతోంటే, అసలు ఆమె యెవరా యెలా తెలుస్తుంది. తిరిగి ఆమెని కలవాలంటే' అనుకొంటూ వెనక్కి తిరిగి ఆమె వెనకాలే కాస్త దూరంలో నడుస్తున్నాడు.

తన వెనక వొక అపరిచితుడు నడుస్తున్నాడనే స్పృహ లేని ఆమె మెల్లగా ఆ దారికి కాస్త పక్కగా వున్న దేవాలయంలోకి వెళ్లింది. ఆ దేవాలయ ప్రాంగణం నుంచి కిందకి యేటవాలుగా వూరు కనిపిస్తోంది. ఆ ప్రాంతపు అడవిపూల, వాసన వాన చినుకులతో తడిసిపోయి గమ్మత్తైన సువాసలు గాలిలోకి పయనిస్తున్నాయి.

యీ మత్తైన పరిమళం ఇలాంటి పరిసరాలలో నాకిష్టమైన మనిషుంటే యెంత బాగుండును అనుకుంటుండగానే ఆమె కళ్లల్లో చిన్నితడి. 'యిక్కడుంటే మనసిలానే పరిపరివిధాల పోతోంది. క్లాస్‌కి వెళ్లిపోవాలి' అనుకొని ఆమె గుడిలోంచి బయటికి రాబోతోంటే అతను యెదురొచ్చి స్నేహపూరితంగా నవ్వుతూ, "హాయ్... హలో అయామ్ జయదీప్" అంటూ షేక్‌హ్యాండ్ ఇవ్వటానికి చెయ్యి జాపి అంతలోనే వెనక్కి తీసుకొన్నాడు అనుకొని అతన్ని చూడగానే ఆమె అప్రయత్నంగా వో అడుగు వెనక్కి వేసింది. అతను కొంచెం ధైర్యం తెచ్చుకుంటూ "నేనే వూరికి సినిమా షూటింగ్‌కొచ్చాను. సినిమాటోగ్రాఫర్‌ని. ఈ రోజు షూటింగ్ అయిపోయింది. ఇటొస్తుంటే మీరు కనిపించారు. మిమ్మల్ని ఫాలో అయ్యా. మీ పేరు....." అడిగాడు.

"వో ఐ.సీ.... నైస్ మీటింగ్ యు" అని ఆమె అతన్ని తప్పించుకొని ముందుకు వెళ్లబోతుంటే అతను తిరిగి "మీ పేరు" అడిగాడు. "మృదుల" అని ఆమె కాస్త వేగంగా తన స్కూల్ వేపు వెళ్లిపోయింది. అతను ఆమె వెనకే నిదానంగా స్కూల్ వరకు వెళ్లాడు. ఆమె అతనిని గమనించలేదు.

సాయంకాలం స్కూల్ అయ్యాక ఆమె బయటికి రాబోతోంటే తిరిగి యెదురొచ్చాడు.

"హాయ్ః మృదుల, అయిపోయిందా స్కూల్" అడిగాడు. అతని వేపు ఓ క్షణం చూసి "మీరెవరో తెలీదు. మధ్యాహ్నం పరిచయం చేసుకొన్నారు. యిప్పటివరకూ మీరిక్కడ ఇలా వెయిట్ చేస్తూ వున్నారంటే, నాతో మాట్లాడాలనే కదా! అదే నిజమయితే మీతో మాట్లాడే ఆసక్తి నాకేమాత్రం లేదు" అందామె.

"యెందుకు...."

"నాకాసక్తి లేదంతే" అని ఆమె తన ఇంటివేపు వెళ్లబోతోంటే, అతను ఆమెకి అడ్డంగా నిలబడి, "అందులో ఆశ్చర్యం లేదు. మీకు ఆసక్తి కలిగించేంత హేండ్‌సమ్ పర్సనాల్టీయేం కాదు నాది. మీకు గెడ్డం అంటె ఆసక్తి వుంటే తప్పా మీరు నావైపు చూడాల్సిన అవసరం లేదు. కాని మీరలా లేరే. అందం ఒక్కటే కాదు.... ఇంకా ఇంకా అని ఆగి ఆమె కళ్లవైపు చూస్తూ మీ కళ్లల్లో యేదో వుంది కట్టిపడేసే శక్తి.... సమ్మోహన శక్తి. యేం మా ప్రొఫెషన్‌లో యెంతోమందిని చూస్తాం. ఎటు చూసినా అందమే. బట్... మీరలా క్కాదు. ఇలా కొత్తవాళ్లతో మాట్లాడ్డం నాకేం కాదు. స్క్రీన్‌కి ఎవరైనా అమ్మాయి ముఖం బాగుంటుంది అనిపిస్తే పరిచయం చేసుకొంటాం. సినిమాలంటే ఇష్టమా... నటిస్తారా ఇలా మాట్లాడిస్తాం. మీరు స్క్రీన్‌కి పనికొస్తారాని చూడటం లేదు. మీతో కలిసి జీవితం పంచుకొంటే యెలా వుంటుందని ఆలోచిస్తున్నా ఇంతసేపు. బాగుంటుందనిపించింది. అందుకే అడిగా" అన్నాడు. ఆమె తిరిగి వెళ్లబోతోంటే "ఈ స్కూల్ గవర్నమెంట్‌దా... మీతో మాటలు పెంచాలనే అడుగుతున్నానని మీరు కనిపెట్టేసి వుంటారు. కానీ నిజంగానే నాకా విషయం తెలుసుకోవాలని వుంది" అన్నాడు జయదీప్.

"యీ స్కూల్ వివరాలు కావాలంటే లోపల ప్రిన్సిపాల్ వున్నారు. అడగండి. నిజంగానే ఎవరితో మాట్లాడాలని లేదు" అని ఆమె వెళ్లసాగింది.

తిరిగి చిన్న జల్లు. తన చేతిలోని గొడుగుని తెరచి వేసుకొంటుంటే అతనొచ్చి "వర్షమొస్తోంది. మీతో అక్కడివరకూ రావచ్చా" తిరిగి అడిగాడు.

"సారీ... నా గొడుగులో ఇంకొకళ్లు పట్టేంత ప్లేస్ లేదు" అని ఆమె ముందుకెళ్లిపోయింది.

ఆమె వెళ్లిన వైపే చూస్తుండిపోయాడు చిన్నగా నవ్వుకొంటూ. ఇంటికొచ్చేసరికి నూర్ హడావిడిగా బాంబూతో వంటలు తయారుచేయిస్తూ కనిపించింది.

"యేంటీ హడావిడి. ఎవరైనా డిన్నర్‌కి వస్తున్నారా" అడిగింది మృదుల.

"అవునమ్మాయిగారూ, నాన్నగారు డిన్నర్‌కి సినిమా షూటింగ్‌కొచ్చిన వాళ్లని పిలిచారంట. మన వెదురు వంటలు, తిని ఇంక వాళ్లు ఇక్కడే వుండిపోతామంటారేమో" నవ్వుతూ అంది నూర్.

"బాంబూలే చేసినవి తినే అలవాటు లేకపోతే, వెంటనే నచ్చే ఛాన్స్ తక్కువే" అంటూ మృదుల తన గదివైపు వెళుతూ, "ఆ జయదీప్ కూడా వస్తాడో యేంటో' అనుకొంది. "చాలా యెక్కువ

మాట్లాడతాడు. రాత్రి వాళ్ల కళ్ల పడకుండా వుంటేనే మంచిది. అయినా ఇక్కడ యెప్పుడూ మూడు నాలుగు సినిమాల షూటింగ్స్ జరుగుతూనే వుంటాయి. డిన్నర్‌కి వచ్చేవాళ్లు సేమ్ యూనిట్ కాకపోవచ్చు కదా" అనుకొంటూ గదిలోకి వెళ్లి స్నానం చేసి చుడీదార్ వేసుకొని రెడీ అవుతుంటే టీ కప్పుతో గదిలోకొస్తూ అమ్మమ్మ...

"చేబక్కా వాళ్ల పిల్లలు మేం ఇండియాకి రాం కదా. మా ల్యాండ్ అమ్మి బెంగుళూర్లోనో, హైదరాబాద్‌లోనో రోహుసెస్ మీద ఇన్వెస్ట్ చేయ మంటున్నారంట. ఇక్కడున్న వాళ్ల కంటె బయటి వాళ్లు అయితే ఎక్కువ డబ్బులు ఇస్తారు కదా వాళ్లకి అమ్మమంటున్నారంట" అంది అమ్మమ్మ.

"బయటవాళ్లకి అమ్మితే వాళ్లేం ప్లాన్‌టేషన్స్ వేయరు. రిసార్ట్స్ కడతారు. వాళ్లకి యే కొండ అంచుకొడితే యేమవుతుందో, యే చెట్లు నరికేస్తే యేం జరుగుతుందో తెలీదు. ప్చ్...." అంది అమ్మమ్మ.

"ఎప్పుడైతే యిక్కడ టూరిజంకి డోర్స్ ఓపెన్ చేశారో యెన్నెన్ని సమస్యలు. యెకో సిస్టమ్ బాగా దెబ్బతింటోంది. పొల్యూషన్. అమ్మమ్మ, మనం ఉదయం తలుపులు వేసి సూర్యోదయం వైపుకి నమస్కరించి తిరిగి రాత్రి పడుకునేముందు ఆకాశానికి దండం పెట్టి పడుకునే వరకు అసలు తలుపులు వేసేవాళ్లమా.... ఇప్పుడు చూడు దొంగల భయం. మన దగ్గర యెప్పుడు ఇంట్లో వో, అని డబ్బులేం వుండవ్. కాని మన లైఫ్ స్టైల్ అలా అనిపిస్తుంది. బయటవాళ్లు రావటం మొదలుపెట్టినప్పట్నుంచి మన యేరియాకి ఇన్‌కమ్ మాట దేముడెరుగు... మన బ్యూటిఫుల్ లైఫ్ మాత్రం చాలా డిస్ట్రబ్ అవుతోందనుకో" అంటూ తాగిన టీ కప్పు టేబుల్‌పై పెడుతూ "బేబక్కా వాళ్ల ల్యాండ్ అమ్మకుండా వాళ్లని ఒప్పించ లేదంటావా" అడిగింది మృదుల.

"ఆ పిల్లలు యెక్కడ వింటారమ్మా" ఈ జనరేషన్‌లో నీలా ఈ పుట్టి పెరిగిన ప్రాంతంపై మమకారం వున్నవాళ్లెంతమందమ్మా. అంతా అవకాశాలంటూ ఇక్కడ నుంచి పారిపోతుంటే అసలు నాకన్పిస్తోంది కొన్నాళ్ల తర్వాత ఈ భాష, సంస్కృతి అంతా గతమే అయిపోతోందాని. ప్చ్! యేం చేస్తాం ఇదో సరిచేయలేని పరిస్థితి. డిన్నర్‌కి సినిమావాళ్లు వస్తున్నారంట. ఏర్పాట్లు చూసొస్తా" అంది అమ్మమ్మ.

మృదుల చివరనున్న గదిలోకి వెళ్లింది. అక్కడ తల్లి, ఓ నలుగురు పిల్లలకి గిటార్ నేర్పిస్తోంది. కాసేపు అక్కడ కూర్చుని తీగెలపై కదులుతున్న తల్లి చేతివేళ్లని చూస్తూ "అమ్మకెంత డిసిప్లేనో. తనకి వూహ తెల్సినప్పట్నుంచి చూస్తోంది. తల్లి ఈ సంగీతం నేర్పించే పనిని ఎప్పుడు మానలేదు. ఇదొక్కటే కాదు ప్రతిపనిని ఇంత శ్రద్ధగా చేస్తుంది" అనుకొంది.

తిరిగి గదిలోకి వచ్చింది. చిన్న స్టడీరూమ్. పి సి ముందు కూర్చుని మెయిల్ వోపెన్ చేసింది. గుండెలు యెప్పట్లా టక్‌టమ్‌మంటున్నాయి. తను యెదురుచూసిన మెయిల్ లేదు.

"ప్చ్...." వో క్షణం ఆమె కళ్లు చెమర్చాయి. ఎందుకింత కఠినం.... నిజంగానే కఠినమేనా... యేమో.... అనుకుంటూ వేరే మెయిల్స్‌కి రిప్లై ఇచ్చే మూడ్ లేకపోయినా పని పూర్తి చెయ్యాలని జవాబు లివ్వటం మొదలుపెట్టింది.

పిల్లల సైకాలజీ కాలమ్‌కి వచ్చిన ప్రశ్నలకి జవాబులు రాసి పత్రికవాళ్లకి మెయిల్ చేసింది. ఆ పనంటే మృదులకి చాలా యిష్టం. ఇంతలో నూర్ టీ తీసుకొచ్చి ఇచ్చి "ఆ హీరోయిన్ చాలా చిన్నపిల్లమ్మా. సినిమాలో వేరుగుంది. ఇక్కడ వేరే వుంది. అసలు మీ ముందు యే హీరోయిన్స్ ఆనరమ్మా" అంటూ తన కాటుక కళ్లని చకచకా తిప్పుతూ వడివడిగా ఖాళీ టీకప్పు తీసుకొని వెళ్లిపోయింది. ఇలాంటి మాటలకి అమ్మాయిగారే మంటారోనన్నట్టుగా భయంగా. లాన్ పక్కనున్న గార్డెన్ వూయలలో కూర్చొని మెల్లగా వూగుతోంది మృదుల.

"ఇది మీ యిల్లన్న మాట. బాగుంది. చాలా డిఫరెంట్‌గా మీ వూరు కూడా. అసలు యీ వూరిని వదిలి వెళ్లాలనిపించటం లేదు. జీవనం ఫర్ జీవనంలా ఎంత బాగుందో. అసలు మీరు కనిపించాక అసలు వెళ్లాలనిపించటం లేదు" అంటూ పక్కగా నిలబడ్డాడు జయదీప్.

ఆమె అతని వైపు పరిశీలనగా చూసింది. కోలముఖం. పల్చని గెడ్డం. మెరుస్తున్న లేత తేనె రంగు కళ్లు. సూదంటు ముక్కు జీన్స్‌పై ఫుల్ హేండ్స్ టామిహిల్ ఫిగర్ టీషర్ట్.

"జయదేవ్, మీ మాటలు యే పద్దెనిమిదేళ్ల అమ్మాయినో ఇంప్రస్ చేయొచ్చేమో. నన్ను కాదు. మీరిలా మాట్లాడటం మానేస్తే మంచిది" నవ్వుతూ అంది మృదుల. "మీ ఏజ్ ఎంత? లేడీస్‌ని అడగొచ్చా.... ట్వంటీ" అన్నాడు. "నో.... 26" అంది.

మృదులా... నిజంగా మీరు నచ్చారు. మీ పేరెంట్స్, ఈ ఇల్లు, వూరు అన్నీ నచ్చాయి. మిమ్మల్ని మ్యారేజ్ చేసుకోవాలని వుంది. ఈ విషయం మీ పేరెంట్స్‌కి చెప్పినా మీ ఇష్టం అనొచ్చు. వాళ్లకి కన్వెంషనల్‌గా వుండే అబ్జెక్షన్స్ వుండకపోవచ్చుని పిస్తోంది. మీరేమంటారు. మీ అభిప్రాయం చెప్పండి. నా గురించి యేం తెల్సుకోవాలన్నా అడగొచ్చు" అన్నాడు.



"యిష్టం లేదు"

"యెందుకు" యే అమ్మాయైనా వెంటనే యస్ అనదు కదా అనుకొంటూ చిన్నగా నవ్వుతూ అడిగాడు.

"జయదేవ్... యిదంతా అవ్వని విషయం. ఇంకా యీ టాపిక్ వదిలేయండి" అందామె.

"యెందుకు.... మిమ్మల్ని ఎప్పుడు ప్రేమగా చూసుకుంటాను మృదుల" అన్నాడు.

అతని వైపు తేరిపార చూస్తూ వూయల్లోంచి లేచి యింటి ఆవరణలోని పాత్‌వే మీద నడుస్తూ "మీరు ప్రేమగా చూసుకొన్నా చూసుకోకపోయినా యీ పెళ్లి జరగదు" అంది.

"యెందుకు... నచ్చలేదా నేను"

"పెళ్లి చేసుకోవాలనేంత ఇష్టం నాకెవ్వరి మీద కలిగే అవకాశం లేదు" అంది.

"యెందుకు"

"ఐయామ్ మ్యారీడ్" అంది.

"వో క్షణం ఆమె వైపు చూస్తూ "జోక్" నవ్వుతూ అడిగాడు. "జోక్స్ కట్ చేసేంత చనువు మనిద్దరి మధ్యా వుందని నేననుకోవటం లేదు. నిజంగానే నాకు పెళ్లయింది" అంది.

"మరి అతను" అయోమయంగా చుట్టూ చూస్తూ అడిగాడు.

అతని వైపు చూస్తూ "గుడ్‌నైట్ జయదేవ్" అని ఆమె తన గదిలోకి వెళ్లిపోయింది.

'పెళ్లైపోయిందా... నిజంగానే...' అనుకొంటూ జయదీప్ తన యూనిట్‌తో కబుర్లు చెపుతోన్న మృదుల ఫ్యామిలీ మెంబర్స్ వున్న ప్లేస్‌కి వెళ్లాడు.

ఛ.... యీ రోజు వుదయం నుంచి ఇతనేంటి ఇలా అడుగుతున్నాడు. యేం జరుగబోతోంది. యెందుకిలా ఎప్పుడు లేంది యిలా



ఓ అపరిచితుడు తనని ప్రపోజ్ చేస్తున్నాడు. పృథ్వీకి చెప్పాలి. ఎలా.... తను పలకరిస్తూ రాస్తోన్న మెయిల్స్‌కి జవాబు లేదు. ఒక్క యస్.యం.యస్.కి రిప్లై లేదు. అతను ఫేస్‌బుక్‌ని అప్‌డేట్ చేయటం లేదు. కమ్యూనికేషన్ ఇంతలా పెరిగిన ఈ కాలంలో ఆప్తులని ఎంతో త్వరత్వరగా పలకరించటానికి యెన్నో సాధనాలున్నా మనసుండటం ముఖ్యం. ఇప్పుడు ఆ మనసు యెన్నెన్నో విషయాలలో చిక్కుకొని అసలు జీవనసారాన్ని వదిలి చిక్కుముడుల మిఠాయిపొట్లంలా తయ్యారయింది.

ఆమెకి తన పెళ్లి, తర్వాత జీవితంలో సంఘటనలు గుర్తొస్తున్నాయి.

పృథ్వీ వాళ్లది మృదుల వున్న వూరికి చాల దగ్గర. చాల అందమైన వూరు. వసంతం మొదలైనప్పుడు, హేమంతారంభంలో వాళ్ల వూర్లో చుట్టుపక్కల గ్రామాలవారంతా చేరి సంబరాలు చేసుకోవటం. ప్రకృతికి పూజాలు చేయటం, పెద్దల్ని ప్రార్థించటం, ఎంతో కోలాహలంగా వుండేవి ఆ రెండు మాసాలు. పృథ్వీని ఇంట్లోవాళ్లు ప్రపోజ్ చేసినప్పుడు తనకి యెలాంటి అభ్యంతరాలు లేవ్. అతను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. యెక్కువగా తన వూరికి ఇంటికి బయటే చదువు నిమిత్తం పెరిగాడు. వీలైనప్పుడు హాలిడేస్‌లో యింటికి రావటం. మృదులా కూడా బయటే చదువుకొంది. యెప్పుడు వీలైతే అప్పుడు వూరికి రావటం, చుట్టాలని విజిట్ చేయటం, ప్లాంటేషన్‌లో పని చేసేవాళ్లని కలవటం, యెక్కడున్నా మనసెప్పుడు యీ వూరిని, యింటిని అతుక్కునే వుండేదామెకి.

పెళ్లయ్యాక పృథ్వీకి హైదరాబాద్‌లో వుద్యోగం వచ్చింది. హైదరాబాద్ మంచి ప్లేస్. అన్ని రకాల వాళ్లని యిముడ్చుకుంటుంది. ఓ ఫ్లాట్ అద్దెకి తీసుకున్నారు. అందంగా, నీట్‌గా సర్దుకొంది మృదుల. తను ఇంట్లో వున్నా లేకపోయినా ఇంటిని క్లీన్ చేసే పనమ్మాయి దొరకటం అదృష్టంగా భావించింది.

యింగ్లీషు మ్యాగజైన్స్‌కి కాలమ్ రాయటం, పిల్లలకి మ్యూజిక్ నేర్పించటం, పిల్లల సమస్యలకి కౌన్సిలింగ్ ఇవ్వటం, వీకెండ్స్‌కి పృథ్వీతో కలిసి బయటికి వెళ్లటం. పృథ్వీ కొలీగ్స్ అరేంజ్ చేసే పార్టీస్‌కి వెళ్లటం. అప్పుడప్పుడు పార్టీస్ యివ్వటం, పృథ్వీకి లీవ్ సమస్య కాబట్టి వొక్కర్తే రెండు నెలలకో ఒక్కమారు వెళ్లేది. పృథ్వీ వైపు చుట్టాల్ని పలకరించటం, పుట్టిన రోజులకి, పెళ్లిరోజులకి విష్ చేయటం పృథ్వీ కంటే మృదులే అందరితో కాంటాక్ట్‌లో వుండేది. ప్రత్యేక సందర్భాలలో పృథ్వీ కూడా వూరికి వచ్చేవాడు.

"నువ్వు జాబ్ చేయొచ్చుగా" అడిగాడో రోజు పృథ్వీ.

"యింట్రస్ట్ లేదు పృథ్వీ" అంది మృదుల.

"కార్పొరేట్ సెక్టార్‌లో, ఐటిలో నీకు చాలా అవకాశాలున్నాయి. ఎందుకు వదులుకోవాలి. క్వాలిఫికేషన్ వేస్ట్ చేయటం ఎందుకు" అడిగాడు పృథ్వీ.

"అరే... నాకాసక్తి లేదు. నాకిలా నా టైమ్ నా చేతుల్లో వుండే జాబ్స్ చేయటం ఇష్టం. నాకు చాల రకాల పనులు చేయటం ఇష్టం. అందులోంచి కొన్ని పనుల ద్వారా వచ్చే ఇన్‌కమ్ బాగుంది కదా" అందామె. "జాబ్ చేస్తూ ఆ పనులు చేసుకో" అన్నాడు.

"వో పృథ్వీ జాబ్ చేయటం మొదలుపెడితే వేరే పనులకి టైమ్ ఎక్కడ సరిపోతుంది. చైల్డ్ కౌన్సిలింగ్ ఇష్టమైన పని. మంచి ప్రొఫెషన్. మ్యూజిక్ నేర్పించటం ఇష్టం. ఆ రెండింటిలో ఇన్‌కమ్ బాగుంది. హైదరాబాద్ మంచి హేపెనింగ్ ప్లేస్. థియేటర్ యాక్టివిటి బాగుంది. షబానప్లేకి ఎంతోమంది వచ్చారు. థియేటర్ని పర్ష్యూ చేయాలనుంది" అంది.

"యిలాంటి ప్రొఫెషన్స్‌ని ఎవరు పట్టించుకుంటారు" అన్నాడు. "ఎవరో పట్టించుకుంటారని కాదు. అవి నాకిష్టం. పృథ్వీ, నువ్వు మరో విషయం ఆలోచించు. నీది టైమ్ చాల తీసుకునే జాబ్. నువ్వు ఉదయం పన్నెండుకో, పదకొండుకో వెళితే రాత్రి పన్నెండో, పదో అవుతోంది. నీ టైమ్ ప్రకారం నే దేని ప్లాన్ చేసుకుంటున్నాను. సో మనం కాస్త టైమ్ కలిసి స్పెండ్ చేయగలుగుతున్నాం. అదే నేను నీలాంటి ప్రొఫెషన్‌లోకి వస్తే మనిద్దరి టైమింగ్స్ వేరవుతాయి. ఈ ఫ్లాట్‌లో మనం ఫ్లాట్‌మేట్స్‌గా బతకాలి. ఇంటిని నీట్‌గా పెట్టుకోవటం, ఇంట్లో చేసుకొన్న ఫుడ్‌ని ఇద్దరం కలిసి తినటం, మన ప్రొఫెషన్స్‌లోని విషయాలని షేర్ చేసుకోవటం, మనవాళ్లని విజిట్ చేయటం ఇలా లైఫ్‌లోని ప్రతి విషయం ప్యారలల్‌గా నడుస్తుంటాయని, అలా వెళ్లటంలోనే సంతోషం వుంటుందని అనుకుంటున్నాను. నా అనుభవం కూడా అదే కరెక్ట్ అంటుంది పృథ్వీ. ఇద్దరం అలసిపోయి ఎవరి ఆఫీసుల్లో వాళ్లు తిండి తిని నీట్‌గా లేని ఇంట్లోకి ఆఫీసుల నుంచి అర్ధరాత్రో, అపరాత్రో వచ్చి స్నానం చేసే ఓపిక కూడా లేకుండా పక్కలపై వాలిపోవటం.... ఛ్.... అసలా లైఫ్ నచ్చదు. జీవితమంటే ఉద్యోగం ఒక్కటే కాదు పృథ్వీ అదొక భాగం మాత్రమే" అంది మృదుల.

"నీకేమైనా మతుండే మాట్లాడుతున్నావా... జాబ్ చేయటం చాల చాలా యింపార్టెంట్. లేకపోతే నా సర్కిల్లో నాకెంత యిన్సల్ట్. నీ వైఫ్ ఏం చేస్తుందంటే చెప్పటానికి డిజిగ్నేషన్ వుండదు. కంపెనీ పేరుండదు. నా ఫ్రెండ్స్ మా కొలీగ్స్ వాళ్ల వైఫ్ ఎంచక్కా గూగుల్, ఇన్ఫోసిస్, విప్రో ఇలా ప్రతి ఒక్క కంపెనీలో వున్నారు. మృదులా మన యేజ్ గ్రూప్‌తో మన ట్రావెల్ వుండాలి. మన యేజ్‌కి సరిపడా డిజిగ్నేషన్ వుండాలి. లేకపోతే మనం వెనకపడినట్లే. నాకైతే నీ ప్రొఫెషన్ విషయం చాల నిరాశని కలిగిస్తోంది. ప్లీజ్... అప్లై చేయి. జాబ్ చేయి" అన్నాడు పృథ్వీ.

"నాకాలోచనే లేదు పృథ్వీ. అలాంటి జాబ్స్ చెయ్యాలనిపిస్తే క్యాంపస్ సెలక్షన్స్‌కి అటెండయ్యేదాన్ని కదా" అంది.

"మరెందుకు చదువుకున్నావ్"

"చదవాలని అనుకోలేదు. మా ఫాదర్ ఆర్డర్. అప్పటికి నాకాయన్ని కన్విన్స్ చేసేంత శక్తి, జ్ఞానం లేదు. చదువుకొన్న ప్రాసెస్‌లో నేనీ జాబ్ చేయలేనని నాకా యెక్సైట్‌మెంట్ లేదని అర్థం అయింది. అందుకే ఇది పూర్తయ్యాక సైకాలజీ సబ్జెక్ట్‌తో మరో డిగ్రీ చదివాను" అంది.

'సిటీకొచ్చావ్. నువ్వు చదువుకొంది సిటీస్‌లోనే. నీ ఆలోచనలు హారిబుల్. బిపివోల జాబ్స్‌కి ఎంత క్రేజ్ వుంది. అర్థం చేసుకో. నీ క్వాలిఫికేషన్‌కి, నీ ఇంగ్లీషు లాంగ్వేజ్ స్కిల్స్‌కి, నీ సాఫ్ట్‌స్కిల్స్‌కి నువ్వు ఈసరికే ఎక్కడో వుండేదానివి. కమాన్ మృదుల తలతిక్కగా మాట్లాడకు. నీ గురించి చెప్పుకోవాలంటేనే ఇన్సల్ట్‌గా వుంది" అన్నాడు పృథ్వీ.

మృదుల అప్రయత్నంగా షాకైయింది.

"యిదేంటిలా ఇంత బిట్టర్‌గా మాట్లాడుతున్నాడు. తన గురించి చెప్పుకోవాలంటేనే అవమానకరంగా వుందంటున్నాడేంటి? అంత యిన్సల్టింగ్‌గా ఫీలవుతున్నాడా? అతని స్వరంలో చనువు లేదు. ఇరిటేషన్ వుంది. ఇది యిప్పటికిప్పుడు కలిగిన చికాకా.... అతనిలో చాలాకాలం నుంచి వుందా? తను గుర్తుపట్టలేదా. తన ఆలోచనలు, తన పని వేరు,

యిష్టాలు వీటిపట్ల యితనికి రెస్పెక్ట్ లేదా... నిజమా... మరి యిన్నాళ్ల జీవితం.... అతను చేస్తున్న పనిని, అతనికి నచ్చే విషయాలని, ఫుడ్‌ని ఒకటేంటి అతని జీవనసరళిని తను గౌరవిస్తోంది కదా.

"ఫైనల్ డెసిషన్ యేంటి. జాబ్ చేయవ్ అంతేగా" అన్నాడు.

"అంతగా ఆసక్తి లేదు."

"యిష్టమైనవాళ్ల కోసం అంతా చాలా చాలా చేస్తారు. నీకు నువ్వే ముఖ్యం కాని నా ఇష్టాలు, అవమానాలు నీకక్కర్లేదు. నీ సెల్ఫ్ రెస్పెక్ట్‌తోనే బతుకు" హేళనగా అన్నాడు.

మృదుల మనసు చివుక్కుమంది.

యేంటి యిదంతా.... యింతగా హర్ట్ చేసుకోవాలా... అతను ముభావంగా వుండటం. ఇంట్లో తినటం మానేసి ఆఫీస్‌లోనే తినటం. మృదుల కాల్ చేసినా రిసీవ్ చేసుకోక పోవటం మృదులని బాధ కమ్ముకొంది.

అతను నిజంగానే తను జాబ్ చేయకి పోవటాన్ని, తనకి అతని చుట్టూ వున్నవాళ్లు అనుకొన్నదో లేదా అర్థమయే ప్రొఫెషన్ లేకపోవటాన్ని అతను ప్రెషర్ ఫీలవుతున్నాడా? పోనీ జాబ్‌లో జాయిన్ అయితే.... అతను హేపీగా ఫీలవుతాడా.... అతన్ని బాధపెట్టటం యెందుకు? జాయిన్ అయితే తన యిష్టాలని తను సరిపెట్టుకొంటుందా.... లేదా జాబ్ టైమింగ్స్ బట్టే తను తన మిగిలిన పనులని ప్లాన్ చేసుకోవాలి. పృథ్వీని బాధపెట్టటం యెందుకు?

మృదులకి జాబ్ వచ్చింది.

యింటర్నేషనల్ కంపెనీ. డిజిగ్నేషన్ వచ్చింది. మెడలో ఓ తాడు ఐడికార్డ్ వచ్చాయి.

పృథ్వీ యేమంత పెద్దగా సంతోషించినట్టు కనిపించలేదు. తనకోసం ఆమె జాయిన్ అయిందనే ఆనందాన్ని అతను వ్యక్తపరచలేదు.

అదే ముభావం.

అదే విసుగు.

మృదులకి వో వైపు ఈ ఉద్యోగాన్ని యెలా యిష్టపడాలానే ప్రయత్నం చేస్తూనే మరోవైపు ఈ పృథ్వీ చికాకుని ఎలా తగ్గించాలనే ఆలోచన, ప్రయత్నాలు. వీటన్నింటితో ఆమె మనసు అలజడిగా వుండటం. సరిగ్గా నిద్రపట్టదు.

ఆ రోజు మృదుల బర్త్‌డే.

అతను మర్చిపోయాడు పూర్తిగా. తన మాట వినలేదని మృదులని సతాయించటం తేలిగ్గా అనిపించిన అతనికి తన కోసం జాబ్‌లో జాయిన్ అయిన ఆమె ఉనికి అతనికి కంఫర్టబుల్‌గా లేదు. అయితే మృదుల పడుతోన్నంత కాదు కదా అందులో రవ్వంత ఆందోళన కూడా అతని మనసులో లేదు. ఓ ఆర్గ్యుమెంట్ తర్వాత ఆమె తన మాట వింది తప్పా వెంటనే ఒప్పుకోలేదు.... ఇలా అతను తన ముభావానికి కారణాలు వెతుక్కున్నాడు. అతను బానే వున్నాడు. ఈ ప్రాసెస్‌లో అతను మర్చిపోయిన పుట్టినరోజుని ఆమె గుర్తు చెయ్యాలనుకోలేదు.

యింట్లోవాళ్లు, పృథ్వీ పేరెంట్, కజిన్స్, మృదుల ఫ్రెండ్స్ మృదులకి యాహూ గ్రీటింగ్‌కార్డ్స్‌ని పంపారు. ఎస్.ఎం.ఎస్. చేశారు. ఫోన్ చేసి మాట్లాడారు. ఇవన్నీ సంతోషాన్ని ఇచ్చినా గుండెల్లో ముల్లు గుచ్చుకున్న బాధ. పృథ్వీకి తను గుర్తు లేదు. అసలు వీళ్లంతా పలకరించక పోయినా ఒక్క పృథ్వీ గ్రీట్ చేసుంటే కూడా ప్రపంచమంత ఆనందం. ఆ రిలేషన్‌షిప్‌లో ఏదో మ్యాజిక్ వుంది. చాల అపురూపంగా కనిపిస్తాయి కదా ఎవరికైన తమ పార్టనర్ తలపులు. అతను రాత్రివేళ చాల ఆలస్యంగా రావటం. ఉదయం త్వరగా వెళ్లిపోవటం వీకెండ్స్‌లో కూడా మధ్యాహ్నం వెళ్లి రాత్రి యే రెండుకో రావటం. మృదులని ఎక్కడికి తీసుకువెళ్లటం లేదు. మృదుల వెళదాం రమ్మన్నా పనుందని వెళ్లిపోవటం. ఈ పరిస్థితిని మార్చాలని ఆమె ఓపిగ్గా అతనితో మాట్లాడబోతే క్లాస్ మొదలుపెట్టకనో, పీక్కనో వెళ్లిపోవటం. మృదులకి యేడ్పొచ్చేది. యేడ్చియేడ్చి సమాధానపడేది. ఆమె యేడ్చిందని ఆమె కళ్లు, ముఖం సాక్ష్యంగా నిల్చినా అతను పట్టించుకోలేదు.

అసలు అతనికి ఆమె పంతం పట్టి ఇల్లు వదిలి ఎందుకు వెళ్లిపోలేదో అర్థం కావటం లేదు.

ఆ రోజు ఆమె టామిహిల్ ఫిగర్‌లో సేల్ పెట్టారని జీన్స్ కొందామని వెళ్లింది. జీన్స్ సెలెక్ట్ చేసి ట్రయిల్ రూమ్‌లోకి వెళ్ళబోతోంటే కింద ఫ్లోర్ నుంచి మెట్లు ఎక్కుతూ పైకి వస్తున్న పృథ్వీ కనిపించాడు. ఆమె కళ్లు ఆనందంతో మెరిశాయి. అతని వైపు వెళ్ళబోతూ చటుక్కున ఆగిపోయింది. అతను తన వెనక వస్తున్న అమ్మాయికి చేతిని అందించటం. ఇద్దరు చేతిలో చేయి వేసుకొని పైకి రావటం. మృదుల బిత్తరపోయింది. ఈ రోజు శనివారం. పనుందని వెళ్లిపోయిన పృథ్వీ ఈ అమ్మాయితో రావటం యేంటి? ఆ అమ్మాయి ఎవరు. అంత చనువుగా సంతోషంగా వున్నాడో. ఆమె వాళ్లకి కనిపించకుండా కిందకి వచ్చేసింది. ఓ అరగంట తర్వాత పృథ్వీ కార్డ్‌తో పే చేయటం, ఇద్దరు బయటికి రావటం, కలిసి పృథ్వీ కారులో వెళ్లిపోవటం చూసిన మృదుల నిలువెత్తు గాయాల హృదయంతో కుప్పకూలి పోయింది.

కాసేపటికి తేరుకొని తల్లికి కాల్ చేసింది.



"యేంటి మృదుల నీ వాయిస్ అలా వుంది" అడిగారామె.

"యేం లేదు ... హెడేక్" అంది

వూరికే చేశానని ఫోన్ పెట్టేసింది.

అతన్ని ఆమె యేం అడగలేదు.

అసలు ఈ విషయాన్ని ఎలా డీల్ చెయ్యాలో తెలియలేదు. యెవరికి చెప్పాలో అర్థం కాలేదు.

రెండు మూడు రోజులు మృదుల మనసు మనసులో లేదు.

అతనితో మాట్లాడడానికి అతను అవకాశం ఇవ్వటం లేదు. అతనికి మాట్లాడాలనిపిస్తే తప్పా అతను మాట్లాడడు. ఆ అమ్మాయి ఎవరో తెలియదు. ఎలాంటి స్నేహమో తెలియదు. తమ ఇంట్లో సందడి పోవటానికి కారణం ఆమేనా. లేక తను ముందు ఉద్యోగం చేయాలని లేదనటమా. ఈ అసంతృప్తి నుంచి ఆమె వచ్చిందా? ఆమె రావటంతో ఉద్యోగం రూపంలో ఈ అసంతృప్తి బయటపడిందా. తెలియదు.

అతన్ని యేం అడక్కుండానే ఈ మొత్తాన్ని భరించాలి. అడిగితే అతను 'నా యిష్టం' అనొచ్చు. 'విడిపోదాం' అనొచ్చు. లేదా తెల్సిపోయిందనే భయంతో కప్పిపుచ్చుకోటానికి ప్రయత్నించొచ్చు. మూడో అవకాశం చాల తక్కువగా కనిపిస్తోంది. తనంటే ఇష్టమో, భయమో, కన్‌సర్న్ వుంటే ఇలా ఎందుకు బిహేవ్ చేస్తాడు.

ప్రస్తుతానికి సహనంగా వుండటమే మంచిదనుకొంది. యేడిస్తే కాని కాసేపు నిద్రపట్టేది కాదు.

వెక్కి వెక్కి యేడ్చేది.

తను, పృథ్వీ యెంతో సంతోషంగా, సంబరంగా జీవించిన కాలం ఆమె మనసులో ఇంకా పచ్చగానే వుంది. అలాంటి జీవనం తిరిగి మాధుర్యం కావాలనిపించింది. చివరికి ఓ రోజు తన స్నేహితురాలు శృతికి ఈ సమస్యని చెప్పింది.

శృతి బెంగుళూరులో ఐ.టి. కంపెనీలో



ప్రొఫెషనల్ కౌన్సిలర్‌గా పనిచేస్తోంది.

'పృథ్వీనా... అరే మీరిద్దరు ఒకరంటే ఒకరు ప్రాణంగా ఇలా వుండాలి కపులంటేలా వుండేవారుగా. ఆర్ యూ ష్యూర్' అపనమ్మకంగా అడిగింది.

ఫోన్‌లోనే భోరున యేడ్చేసింది మృదుల.

"ప్లీజ్.... ప్లీజ్ సరే యేడ్చేయ్" అంది శృతి.

"ఈ వీకెండ్‌కి వస్తాను. ఇలా ఫోన్‌లో అవ్వదు" అంది శృతి. శృతి మృదుల ఇంట్లో దిగలేదు. హోటల్లోనే దిగింది.

"చెప్పు ఎవరా అమ్మాయి" అడిగింది శృతి.

"నాకేం తెలియదు" అంది మృదుల.

"నువ్వు డైరెక్ట్‌గా అడిగితే అతని అహం దెబ్బతింటుంది. మీరిద్దరికి కామన్‌గా వున్న స్నేహితులు ఎవరైనా వున్నారా" అడిగింది.

"ప్చ్. ఫ్రెండ్స్ వున్నారు. కాని, క్లోజ్ ఫ్రెండ్స్ లేరు."

"మీ పేరెంట్స్‌కి చెపితే... లేదా వాళ్ల పేరెంట్స్‌కి చెపితే... ఓ గాడ్..... మన జనరేషన్‌లో మన జీవితాలకి ఎన్నో అవకాశాలుంటాయి. అన్ని దారుల తలుపులు మూసుకుపోయుంటాయి. యే తలుపు యే తాళంతో తీయాలో తెలియదు. ఏం తీస్తే ఏ బ్రహ్మాండం బద్దలవుతుందో తెలియదు. ఎందులో సమస్యకి పరిష్కారం వుందో తెలియదు. అన్ని తెల్సినట్టే వుంటాయి. ఏది మనకి శాంతినివ్వదు. అక్కడ కూడా రోజూ చూస్తున్నాను కదా.... అచ్చు మెట్రో సినిమాలా వుంటాయనుకో జీవితాలు. ఛా ఛ... ఛ.... అస్సలు యిమోషనల్ డిసిప్లీన్ లేదు. నిజంగా మనది యిమోషనల్ అత్యాచార్ జనరేషనే. అనురాగ్ కాశ్యప్ భలే వర్డ్ కాయిన్ చేశాడనుకో" అంది శృతి. "పృథ్వీని అడిగితే యేం జవాబు వినాల్సి వస్తుందోననే భయం. అందుకే అడగాలంటే జంకు" అంది మృదుల.

శృతి ఫక్కున నవ్వింది. నవ్వుతుండగానే ఆమె కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

"మన అమ్మలు, అమ్మమ్మలు ఇంతకంటే ధైర్యంగా, గౌరవంగా బ్రతికారనుకుంటాను. చదువుంటే, ఉద్యోగముంటే, అందముంటే, లోకజ్ఞాన ముంటే జీవితాలు బాగుంటాయంటే అన్ని తెచ్చు కున్నాం. అయినా వేదనే. చాలామంది అమ్మాయిలని, అబ్బాయిలని చూస్తున్నాం కదా. అన్నీ వుంటాయి. ఈ యిమోషనల్ సెక్యూరిటీ వుండటం లేదు. పెళ్లయినా కాకపోయినా, పిల్లలున్నా లేకపోయినా, ఈ ఆకర్షణలు టెంపరరీనో, పర్మినెంటో తెలీదు కాని ఇప్పుడు ఇదో పెద్ద అగాధం. ఓ.కె. చెప్పు యేం చేద్దాం" అడిగింది శృతి.

"నాకతన్నుంచి విడిపోవాలని లేదు. పృథ్వీ చాలా మంచివాడు. చాల ప్రేమగా వుండేవాళ్లం. నాకా ప్రేమ కావాలి. ఈ సంఘటన వలనో లేదా ఉద్యోగం విషయంలో జరిగిన సంభాషణ వలనో అతను చెడ్డవాడని అనలేను. నిజంగా అతనిలో ప్రేమించే గుణం, నిజాయితీ వున్నాయి" అంది మృదుల.

"ఓ గాడ్ మృదులా నీ మాటలు వింటుంటే నువ్వింత అమాయకంగా వున్నందుకు నవ్వాలో, యేడ్వాలో తెలియటం లేదు. ఇట్స్ గాన్ మృదుల. అతను షిఫ్ట్ అయిపోయాడు. నువ్వు ముందు ఆ రియాల్టిని నమ్ము. రెండోది తిరిగి అతను నీ జీవితంలోకి రావటానికి ఇదేం సినిమా కాదు కదా దారి చూపిన దేవతా అంటూ రియలైజ్ అయి రావటానికి. అసలు ఇలా కాదు మృదులా, ఆ అమ్మాయి ఎవరో యేంటి మ్యారీడా కాదా ఈ విషయాలు తెలిస్తే తప్పా నీ సమస్య ఎంత పెద్దదో, చిన్నదో తెలియదు. ఆ అమ్మాయి ఫన్ లవింగ్ గర్ల్ లేదా హేపీ గర్ల్ లేదా ట్రబుల్‌మేకర్ ఇలా ఎలాంటిదో తెలియాలి. మనం ఆ అమ్మాయితో ఈ విషయాలేం మాట్లాడం. దానివల్ల యూజ్ లేదు. పృథ్వీ మ్యారీడ్ అని ఆఫీసులో తెలుసు కదా. ఆమెకి మ్యారీడ్ అని తెలిసే తిరుగుతుందొచ్చు కదా" అంది శృతి.

"నేనెలా తెలుసుకుంటా. అతని ఆఫీస్‌లో కూడా నాకెవరు బాగా తెల్సినవాళ్లు లేరు" అంది మృదుల.

"యిదో గోల. ఓ తెగ మెకానిజం వుంటుంది ఈ దేశంలో. కాని తన మొగుడు ఎవరితో వెళుతున్నాడో తెలుసుకోలేం. కరెక్టే ఎలా తెల్సుకుంటాం. ఏది కంపో, యేది కంచో తెలియదు. ఎటు అడుగు వేస్తే యేది పగిలిపోతుందో తెలియదు. అతుక్కుంటుందో తెలియదు. ఓ.కె. నీకు మానసికంగా ధైర్యం వచ్చే వరకు అతను ఇంటికి వస్తున్నందుకు సంతోషిస్తూ సహనంగా వుండు. యేడుపొస్తే యేడు. కోపం వస్తే నీపై నువ్వే అరచుకో. నీ నిస్సహాయతకి జాలిపడు. నీకే యేదో ఒక పాయింట్‌లో మీ ఇద్దరిమధ్యా వున్న గోడని పగలకొట్టాలనిపిస్తే అప్పుడు మాట్లాడు. లేదా వాళ్లే ఏదో ఒక నిర్ణయానికి వచ్చి నీతో షేర్ చేసుకొనేవరకు ఆగటం. లేదా వాళ్లకే ఇష్టమో, ఆకర్షణో, లేదా ఇద్దరికి ఆ రిలేషన్‌షిప్‌లో ఫ్యూచర్ లేదనిపిస్తేనో విడిపోతారు. అప్పటివరకు ఎదురుచూడటం. ఏది ఏమైనా కొన్నాళ్లు కొన్నేళ్లో ఈ అశాంతి నీకు తప్పదు. మీరిద్దరి మధ్య వున్న ఒకప్పటి ప్రేమ, మోహం అర్థం చేసుకునే సామరస్యం తిరిగి వస్తాయా, రావాలన్నది నువ్వు అతన్ని కోరుకొంటున్నట్టే అతను నిన్ను కావాలనుకోవాలి. ఏది ఏమైనా ఇదొక బ్యాడ్‌టైమ్ నీకు. మృదులా ఇలాంటి విషయాలని మూడో వ్యక్తితో షేర్ చేసుకోవటం నీక్కాస్త ధైర్యానిస్తాయి. కాస్త మనశ్శాంతిగా వుంటుంది. నీకు బాగా దగ్గరివారితో నిన్ను అగౌరపర్చనివారితో షేర్ చేసుకో. నీకున్నంత బాధ, దిగులు పృథ్వీకి లేవు. పైగా అతనికో కొత్త స్నేహం వుంది. అందుకే అతనెక్కడా ఈ విషయాలు మాట్లాడకపోవచ్చు. మాట్లాడటం, మాట్లాడక పోవటాన్ని ఓ వాల్యూగా తీసుకోనక్కర్లేదు. మధ్యవర్తిత్వం కొన్నిసార్లు చాలా అవసరం. అలాంటివాళ్లు దొరికితే కూడా నీ ప్రోబ్లమ్‌కి ఓ దారి దొరకొచ్చు. అతను చేస్తున్న పొరపాటు అతనికి తెలియొచ్చు. నిన్ను బాధ పెట్టకూడదనిపించొచ్చు. ఇంక వెళతాను. మళ్లీ త్వరలో వస్తా. కాల్ చేస్తుంటాను" అంటూ శృతి మృదులని హగ్ చేసుకొని చెమర్చిన కళ్లతో బయలుదేరింది.

శృతి వెళ్లి వారం తర్వాత పృథ్వీ ఆఫీస్‌పనిపై స్టేట్స్ వెళ్లాల్సి వచ్చింది.

ఆ అమ్మాయి కూడా వెళుతుందా అని మృదుల ఆందోళన చెందింది. భయపడింది.

యేం చేయలేని తెలుసుకోలేని నిస్సహాయతతో అమ్మగారింటికి వచ్చింది ఈ నెల రోజులు ఇక్కడ వుందామని.

యెవ్వరికి యేం చెప్పలేదు. కాని ఆ కళ్లల్లో తొలగిన కాంతి ఆమె సంఘర్షణలో వుందని ప్రతి ఒక్కరికి అర్థం అవుతోంది. పృథ్వీ దగ్గర లేదని అలా వుందని అంతా అనుకున్నారు. కాని ఆ దిగులు వేరు యీ దిగులు వేరు అని మృదుల అమ్మమ్మగారు, అమ్మగారు, పృథ్వీవాళ్ల అమ్మగారు గ్రహించారు. తేడా వుందని' అనుకున్నారు.

కాని వాళ్లు యేం అడగలేరు. అడిగే అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. పృథ్వీ యు.యస్. వెళ్లి అప్పుడే యిరవై రోజులైంది. రోజొక యుగంలా వుంది మృదులకి. అతన్ని చూడకుండా ఒక్కరోజైనా వుండలేనంత, దిగులుపడే ఆమెకి యిప్పుడు వాళ్లిద్దరి మధ్యా వున్న స్థితి ఆమెని

మానసికంగా ఎంతగానో కుమిలిపోయేట్టు చేస్తోంది.

యీ పరిస్థితిలో యీ జయదేవ్ ఎదురయ్యాడు. వెలుగురేఖలు భూమి ముద్దాడే సమయమయింది, మృదులకి నిద్రే రాలేదు. లేచి బయటికి వచ్చింది. సూర్యోదయంకి నమస్కరించింది.

మరొక వుదయం.

కొత్త పువ్వులు వికసించాయి.

కొండకోనల్లోంచి పక్షుల పాటలు... అవే పాటలు తిరిగి కొత్త ఉత్సాహంతో వినిపిస్తున్నాయి.

రంగు రంగు సీతాకోక చిలుకలు లార్వా నుంచి బయటపడి మెల్లమెల్లగా యెగుర్తున్నాయి.

యీ రోజైనా పృథ్వీ ఫోన్ చేస్తాడా... తన కాల్ రిసీవ్ చేసుకుంటాడా.... అవే అలజడులతో మృదుల రెడీ అయి స్కూల్‌కి బయలుదేరింది.

యీ నెల రోజులు పిల్లలకి చిన్న చిన్న పాటలని, సాఫ్ట్‌స్కిల్స్‌ని నేర్పిస్తోందామె ఖాళీ వుండకుండా.

క్లాస్ అయ్యాక సాయంకాలం బయట కొస్తోంటే తిరిగి జయదేవ్.

"హాయ్ః మృదులా, పెళ్లయినంత మాత్రాన మరొకరిని ఇష్టపడకూడదని వుందా... మరో ప్రేమ పలకరించకూడదని వుందా. ఆలోచించాను. మీకు పెళ్లయినా నాకేం అభ్యంతరం లేదు. మిమ్మల్ని మర్చిపోలేకపోతున్నా. మీరిప్పుడే మీ హజ్బెండ్‌కి డైవర్స్ ఇచ్చి రానక్కర్లేదు. అసలంత బ్యాగేజ్ మనిద్దరికి అక్కర్లేదు. బట్ మనం ఫ్రెండ్స్‌గా వుండొచ్చు. కలవొచ్చు. ఇద్దరికి ఖచ్చితంగా యీ ప్రేమని నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్లాలనిపించినప్పుడే విడాకుల విషయం ఆలోచించొచ్చు. మీరు ఇండిపెండెంట్ మోడ్రన్ వుమెన్. మీరు ఆఫీసు పని అని చెప్పి ఎప్పుడంటే అప్పుడు ట్రావెల్ చేయవచ్చు. అలా మనం బ్యూటిఫుల్ ప్లేసెస్‌లో కలుసుకోవచ్చు. ఒక్క జీవితం మృదులా సెంటిమెంట్స్ పెట్టుకోకండి. అసలు యీ రోజుల్లో అమ్మాయిలు ఎలా వున్నారు. వెరీఫాస్ట్. మగవాళ్లని ఎంతలా ఆడిస్తున్నారు. మీ అందమైన కళ్లతో లోకాల్నే యేలొచ్చు. మీకు ఓ.కే.నా" మృదువుగా అడిగాడు జయ్‌దేవ్.

వొకప్పుడైతే ఈ మాటలకి మృదుల ఎలా రియాక్ట్ అయ్యేదో కాని యిప్పుడున్న పరిస్థితులు ఆమెకి తన చుట్టూవారిని బ్లాక్ అండ్ వైట్‌గా కాకుండా లేయర్స్‌గా అర్థం చేసుకోడానికి వుపయోగపడు తున్నాయి..

"జయదేవ్, ఓ యిండిపెండెంట్ వుమెన్‌గా లేదా వో మోడ్రన్ వుమెన్‌గా నాకు వున్న అవకాశాలు మరింతగా నా వికాసానికో లేదా చుట్టూ వాళ్ల జీవితాల్లో కాస్త వెలుగుని నింపడానికో వుపయోగ పడాలనుకుంటున్నాను. నేనలాగే వుంటాను. ఈ రోజు మీరంటున్న ఇండిపెండెంట్ ఉమెన్ స్టేటస్ మా జనరేషన్ వాళ్లకి అప్పనంగా ఎవరూ ప్లేట్‌లో పెట్టి ఇవ్వలేదు. ఈ రోజు మేం చాలావాటికి కష్టపడక్కర్లేదు. యుద్ధాలు చేయనవసరం లేదు. ఇవన్నీ మా ముందు తరం స్త్రీలు చేసిన పోరాటాలకి పడిన సంఘర్షణలకి, త్యాగాలకి ప్రతిఫలంగా మాకీ ఇండిపెండెంట్ వుమెన్ స్టేటస్ వచ్చింది. ఈ స్వేచ్ఛని అర్థం పర్థం లేని రిలేషన్‌షిప్స్‌కి ఎలాంటి విలువా లేని విచ్చలవిడి స్నేహాలకి వెచ్చించేంత బుద్ధిలేనిదాన్ని కాదు. మీరలా మాట్లాడటం మీకు ఫ్యాషన్‌గానో, మోడ్రన్‌గానో అనిపించొచ్చు. మీరింక ఇలాంటి పొగడల్తో, సంభాషణలతో రాకండి. మీ టైమ్ వేస్ట్. నాకు నా హజ్బెండ్ అంటే ప్రేమ, గౌరవం. నాకు నేనన్నా అంతే. సో నన్ను నా చుట్టూవాళ్లని అగౌరవపరిచే పనులు నే చేయలేను" అందామె.

"వో గాడ్.... ఇంత ఘాటుగా రియాక్ట్ అయ్యారే. మృదులా మీకున్న క్లారిటి నాకు వుందనుకుంటా నా విషయాల్లో. యిది నా కార్డ్. మీ నెంబర్ తీసుకున్నా రాత్రి ఇంట్లోవాళ్ల నుంచి మీరంటే ఇష్టం. మీరది గుర్తించేవరకు మిమ్మల్ని స్వీట్‌గా డిస్ట్రబ్ చేసినా, వెంటబడినా మీ హజ్బెండ్ కూడా ఆ అమ్మాయి వెనక వెళతాడు. న్యాచురల్ మీరూ అంతే' అన్నాడు జయదేవ్ నవ్వుతూ.

'ఆకర్షణలు బలీయమైనవే కాని వ్యక్తిగతంగా వాటిని కంట్రోల్ చేసుకోవలసిన అవసరం లేదా. ఇలాంటి ఒత్తిడులకే పృథ్వీ లొంగిపోయాడా.....'

"మృదులా"

పరిచత స్వరం.

తలతిప్పి చూసింది మృదుల.

ధరణిగారు పృథ్వీవాళ్ల అమ్మగారు.

"ఆంటి.... యెప్పుడొచ్చారు" ఆనందంగా అడిగింది మృదుల. ఆమె చూస్తుంటే పృథ్వీ తన నుంచి ఎక్కడికి వెళ్లదనిపిస్తుంటుంది మృదులకి.

"మధ్యాహ్నం. అంకుల్ కూడా వచ్చారు. స్కూల్ అయ్యే టైమ్‌కి వద్దామని ఆగి ఇప్పుడొచ్చాను" అన్నారామె. తమిద్దరి మాటలు వింటున్న జయదేవ్‌ని ధరణిగారు ఎవరన్నట్టు చూశారు.

"జయదేవ్. సినిమాటోగ్రాఫర్. షూటింగ్‌కి వచ్చారంట. రండాంటి వెళదాం" అంది మృదుల.

"వో... ఐసీ... అలా గుడికి వెళదామా" అడిగారామె.



"ష్యూర్ ఆంటి"

వాళ్లిద్దరూ గుడి వైపు వెళుతుంటే జయదేవ్ వెనకే త్వరత్వరగా వచ్చి తన కార్డ్‌ని మృదులకి ఇచ్చాడు. ధరణిగారు వున్నారని కూడా తటపటా యించకుండా "వద్దు" అంది మృదుల.

"ప్లీజ్"

ఆమె తీసుకోలేదు.

జయదేవ్ ధరణిగారికి ఇస్తూ "మీరివ్వండి మృదులాకి" అని వెళ్లిపోయాడు.

ఆ కార్డ్‌ని మృదులాని అయోమయంగా చూస్తూ "యేంటమ్మా" అడిగారు.

"అతనో మాడ్ ఫెలో ఆంటీ. నిన్న పెళ్లి కాలేదనుకొని అలా ప్రపోజ్ చేశాడు. ఈ రోజు పెళ్లయినా పర్లేదంటున్నాడు స్నేహంగా వుందామంటు న్నాడు" నవ్వటానికి ప్రయత్నిస్తూ అంది మృదుల.

సాయంకాలపు కొండలగాలి మృదువుగా ఇద్దర్ని స్పర్శిస్తూంటే "సో... ప్రపంచమంతా ఇలానే వుందన్నమాట. పృథ్వీ ఒక్కడే కాదన్నమాట'' చిరునవ్వుతో అన్నారు ధరణిగారు.

మృదుల నిశ్చేష్టురాలైంది.

"నువ్వొచ్చినప్పుడే కాదు అంతకుముందు ఫోన్‌లో నీ గొంతులో జీవం లేకపోవటాన్ని నేను, అంకుల్ గమనించాం. యేమయిందో నువ్వు చెపుతావనిపించలేదు. ఇద్దరం హైదరాబాద్ వెళ్లాం. పృథ్వీ కొలీగ్ ఒకమ్మాయి పల్లవి, వాడు ఆఫీసు నుంచి మాతో మాట్లాడుతున్నప్పుడు మాట్లాడుతుండేది. పల్లవిని కాన్ఫిడెన్స్‌లోకి తీసుకొని పృథ్వీలో మార్పు ఏమైనా వుందాని అడిగా. పల్లవి ముందు పృథ్వీ జీవితం పృథ్వీదంది. అప్పుడే మాకు స్పష్టంగా యేదో తేడా వుందని పల్లవిని కన్విన్స్ చేశాం. మేం తనని కలసిన విషయం పృథ్వీకి చెప్పమని చెప్పాం. అప్పుడామె పృథ్వీ కలిసి తిరుగుతోన్న అమ్మాయి వివరాలు చెప్పింది. పృథ్వీ వాళ్ల ఆఫీసే. ఇప్పుడామె వాడితో అమెరికా వెళ్లలేదు. హైదరాబాద్‌లోనే వుంది.

పృథ్వీ ఆ అమ్మాయికి బాస్. పవర్‌లో వున్నవాళ్ల పట్ల వున్న ఆకర్షణ ఆమెకి పృథ్వీపై వుందంట. ఆమెకి కెరీర్‌పై వున్న ఆసక్తి ఇంతా అంతా కాదని పల్లవి చెప్పింది. ఆ అమ్మాయితో మాట్లాడదామా, ఆ అమ్మాయి పేరెంట్స్‌తో మాట్లాడదామా అని నేను, అంకుల్ చర్చించుకొని చివరికి పృథ్వీతో మాట్లాడటమే కరెక్ట్ అనిపించింది. ఆ తర్వాత ఆ అమ్మాయి విషయం ఆలోచించొచ్చనిపించింది. ఎలాను వెళ్దామని ఆ అమ్మాయి ఫోన్ నెంబర్ పల్లవి దగ్గర్నుంచి తీసుకున్నాం. పృథ్వీ ఇక్కడికి వచ్చాక మాట్లాడదాం ఫోన్‌లో ఎందుకులే అనుకున్నాం. కానీ మీ అంకుల్ వుండలేకపోయారు. పృథ్వీతో మాట్లాడారు. నేనూ మాట్లాడాను. జాబ్ విషయంలో చికాకుపడ్డాం అన్నాడు. మృదుల మాకేం చెప్పలేదు. కాని తను ప్రతి రోజు ఏడుస్తోందని చెప్పాం. స్మాల్ ప్రోబ్లమ్ వర్రీకావొద్దన్నాడు. ఆ అమ్మాయి విషయం చెప్పలేదు తను. మేమూ అడగలేదు. మృదులా ముందు తను నీతో కాస్త మాట్లాడే టర్మ్స్‌కి వస్తే మెల్లగా ఆ అమ్మాయి విషయం సెటిల్ చేద్దాం. పిల్లల్ని కొన్ని వాల్యూస్‌తో, సంస్కారవంతంగా పెంచుతాం. బయట ఆకర్షణలు బలంగా వుంటాయి. కొట్టుకుపోకుండా వుండటానికి చాల శక్తి కావాలి. అలాంటి శక్తి నీకుంది. పృథ్వీకి అంతగా లేదా... చూద్దాం వాడిలో చిన్నప్పట్నుంచి ఇమిడివున్న వాల్యూస్, సంస్కారం, నిజాయితీ, ప్రేమ తిరిగి బలంగా ముందుకొచ్చి ఈ ఆకర్షణలు వెనక్కి వెళతాయేమో. విడిపోటానికి పెద్దగా కష్టపడనక్కర్లేదు మృదుల. కలిసి వుండటానికే చాలా సహనం, ప్రేమ అవసరం. నీ ప్రేమ, సహనం వూరికే పోదు మృదుల. నీతో మేం వున్నాం. పద.... ఇంటికి వెళదాం" అన్నారామె. "థ్యాంక్సాంటి" చెమ్మగిల్లిన కళ్లతో అంది మృదుల.

అమె ఆప్యాయంగా మృదుల చేతిని చేతుల్లోకి తీసుకున్నారు. ఆమె చేతుల్లోంచి జయదేవ్ కార్డ్ కింద పడిపోయింది అప్రయత్నంగా.

కొండపై నుంచి ఇద్దరూ కిందకి వస్తున్నారు.

చివరి వెలుగు అవతలకి వెళుతూ నెలవంక ఆకాశంలో.

చిన్నారి కొత్త చంద్రవంకని చూసి కుడిచేయి అరచేతిని ముద్దుపెట్టుకొంది మృదుల.

బ్యాగ్‌లో సెల్ మోగింది.

నిరాసక్తంగా తీసి చూసింది మృదుల.

పృథ్వీ...

యు.యస్. వెళ్లాక మొదటి కాల్.

"హలో పృథ్వీ"

"యేం చేస్తున్నావ్" అడిగాడు.

సంభాషణ మొదలయింది.

వేయి చందమామల వెలుగు మృదుల కళ్లల్లో.

# మనల్ని మనం స్కానింగ్ చేసుకోవాలి

డి. శశికాంత్

వసుధైక కుటుంబం అన్న
ఈ నేలమీదే
ఇప్పుడు నేల కోసం పిడికిలి బిగిస్తున్నాం
చంద్రుడ్ని అరచేతితో తాకిన మనం
ప్రాంతానికి, మనిషికి మధ్య అగాధం సృష్టిస్తున్నాం
ఈ దేశం వెన్నెముకకి
పురుగుమందు ఆహారమవుతుండగా
పాకిస్థాన్ కాశ్మీర్‌ను ఖబర్‌స్థాన్‌గా మారుస్తుంటే
తీవ్రవాదం మన శ్వాసల్ని ఆర్పేస్తుంటే
మనమేమో
మనలో మనమే మక్‌మోహన్‌రేఖలు గీసుకుంటున్నాం
పక్కనున్న తంబీలకున్న అభిమానం మనకేదీ?
ఒక్కొక్క జెండాతో ఈ దేశపు ఎజెండానే మారిపోతోంది
మనచరిత్రలో ఎప్పుడూ విషాదఘడియలేనా?
రాజకీయ ఉద్యమాలలో ఎప్పుడూ విద్యార్థులే బలిపీఠం ఎక్కాలా?
గురివిందగింజ మనస్తత్వాన్ని ఎప్పుడు విడుస్తామో!!
రాబోయే తరం ఇచ్చే ప్రశ్నాపత్రాన్ని
పూరించడానికి సిద్ధంగా వుండండి.